క్లుప్తంగా

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేలా చూడండి



తెనాలిఅర్బన్: తన కుమార్తె ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతుందని, ఆమెకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేలా చూడాలని తెనాలికి చెందిన ఒక మహిళా కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అలాగే బీసీ కార్పొరేషన్ రుణాన్ని మంజూరు చేయాలని, రామలింగేశ్వర పేటలో మురుగు కాల్వలు నిర్మించాలని, మంచి నీటి పంపులు వేయాలని, 14వ వార్డులో కొత్త రోడ్డు నిర్మించాలని పలువురు అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణికి వినతిపత్రాలు ఇచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వేర్వేరు సమస్యలపై 11 అర్జీలు

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో మొత్తం 11 అర్జీలు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీధర్‌బాబు అర్జీలను స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి అయిదు, డీఎంహెచ్ఓ పరిధిలోనివి రెండు, పోలీస్, హౌసింగ్, పంచాయతీరాజ్, పౌరసరఫరాలశాఖకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున అర్జీలు వచ్చాయి. సంబంధిత అధికారులకు అర్జీలను పంపి నిర్ణీత వ్యవధిలోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని శ్రీధర్‌బాబు తెలియజేశారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో మంటలు

తెనాలిరూరల్: మండలంలోని కొలకలూరు గ్రామంలోని డంపింగ్ యార్డులో సోమవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గ్రామస్తులు గమనించి తెనాలి అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తెనాలిఅర్బన్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఉదయం 11.00 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

బాధితురాలికి చెక్కు అందజేత

తాడేపల్లి రూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను తాడేపల్లి టి.డి.పి నాయకులు సోమవారం బాధితురాలికి అందజేశారు. తాడేపల్లి 14వ వార్డుకు చెందిన నేరిశెట్టి పద్మావతికి రూ.60 వేల ఎల్వోసీ చెక్కును అందజేశామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ధారదాసు, మంగళగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బూదాల రవికుమార్, వల్లభాపురం పీటర్‌పాల్, మరియన్న, దేవ్వళ ప్రసాద్, మంగళగిరి నియోజకవర్గ మహిళా కార్యదర్శి కల్యాణి పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలీ శాఖాగ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులలు భాగంగా 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్ పలు రకాల పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. చదివే విధానాన్ని ఉపాధ్యాయుడు ఫ్రాన్సిస్ పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది దీవి.కృష్ణమూర్తులు పాల్గొన్నారు.

న్యాయస్థానాల తీర్పులను అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చాయని.. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. సోమవారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం దీక్షలు చేస్తున్నారని.. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: గర్భిణులు, బాలింతలు వేసవిలో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని వైద్యురాలు శాంతి అన్నారు. మండలంలోని తాళ్లూరు గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 168 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు వేసవిలో తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. తేలికపాటి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

పదిలో మెరిసిన మాణిక్యాలు

- ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన ఉత్తీర్ణత శాతం
- తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య!

తెనాలిఅర్బన్: పదోవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరుగుతూ వచ్చింది. దీనికి కారణం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలనే చెప్పవచ్చు. గత ప్రభుత్వం అమ్మఒడి, విద్యా కానుక, నాడు–నేడు వంటి పథకాలను విద్యావ్యవస్థలో ప్రవేశపెట్టి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా వీటిని తయారు చేయటంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారియింది.

తెనాలి పట్టణ, మండల పరిధిలో మొత్తం 16 హైస్కూల్స్ ఉన్నాయి. వాటిలో ఈ ఏడాది పదోవ తరగతి చదివిన వారి సంఖ్య మొత్తం 1223 మంది ఉన్నారు. తెనాలి పట్టణ పరిధిలో ఆరు మున్సిపల్ హైస్కూల్స్, ఏపీ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్ ఒకటి, గరల్స్ స్కూల్ ఒకటి ఉన్నాయి. వాటిలో పదోవ తరగతి విద్యార్థులు 744 మంది విద్యను అభ్యసిస్తున్నారు. అలాగే తెనాలి మండల పరిధిలో ఎనిమిది జిల్లా పరిషత్ హైస్కూల్స్ ఉన్నాయి. వాటిలో 473 మంది విద్యార్థులు విద్యను అభ్యసించారు.

పెరిగిన ఉత్తీర్ణత – తగ్గిన విద్యార్థుల సంఖ్య

తెనాలి పట్టణ, మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గత విద్యాసంవత్సరం నుంచి తగ్గుతూ వస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణ చేశారు. ఇంగ్లిష్ మీడియంకు అధిక ప్రాధాన్యత ఇవ్వటం.. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన చేయటంతో పాటు ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్‌లు లేవు అనే బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాలల్లో నాడు–నేడు పథకం పనులు నిలిపివేయటం.. కొన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను నిర్లక్ష్యం చేస్తుండటంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఉత్తీర్ణత శాతం పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. గతేడాది తెనాలి పట్టణం, మండల పరిధిలో మొత్తం 1320 మంది పదోవ తరగతి విద్యను అభ్యసించగా ఈ ఏడాది 1223 మంది విద్యను పూర్తి చేశారు. దీనిని బట్టి చూస్తే సుమారు వంద మంది విద్యార్థులు తక్కువగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతుల కల్పన చేయటంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



తెనాలి మండల విద్యాధికారి కార్యాలయం

ఫలితాల్లో నంది'వెలుగు'!

పదోవ తరగతి పరీక్ష ఫలితాలలో తెనాలి మండల నందివెలుగు జిల్లా పరిషత్ హైస్కూల్ నూరు శా తం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలచింది. ఆ తర్వాత ఖాజీపేట జడ్పీస్కూల్ 95.8శాతంతో రెండవస్థానం, కొలకలూరు జడ్పీస్కూల్ 94.4 శా తంతో మూడవ స్థానంలో నిలిచింది. ఇక తెనాలి ప ట్టణంలో శ్రీమతి దొడ్డపనేని ఇందిర మున్సిపల్ బా లికల హైస్కూల్ 85.4శాతం ఉత్తీర్ణతతో ముందు వరసలో ఉంది. విద్యార్థుల సంఖ్య కూడా బాలికల హైస్కూల్‌లో 171గా ఉంది. ఉత్తీర్ణతశాతం కూ ఎ క్కువనే చెప్పవచ్చు. అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ ఎంహెచ్ స్కూల్ 84.2 శాతంతో రెండొవస్థానంలో, కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్‌హైస్కూ ల్ 78.9 శాతంతో మూడొవ స్థానంలో నిలచింది.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు



తెనాలి పరిధిలో గతేడాదితో పోల్చుకుంటే విద్యార్థుల సంఖ్య కొంత తగ్గిన మాట వాస్తవం. తెనాలి పరిధిలో ఉన్న మొత్తం 92 స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పదిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రస్తుతం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అలాగే పేరెంట్స్ కమిటీ సహకారంతో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్నాం.

–మేకల లక్ష్మీనారాయణ, మండల విద్యాధికారి, తెనాలి

ఆటపాటలతో కూడిన విజ్ఞానాన్ని అందించాలి

తెనాలిటౌన్: ఆటపాటలతో కూడిన విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని నందివెలుగు పంచాయతీ కార్యదర్శి బి.హేమకుమారి సూచించారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో శాఖాగ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పంచాయతీ కార్యదర్శి బి.హేమకుమారి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి నుంచి జూన్ 6వ తేదీ వరకు అన్ని శాఖాగ్రంథాలయాల్లో విద్యార్థుల కోసం వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం ముదావహమని పేర్కొన్నారు. ఆటపాటలతో కూడిన విజ్ఞానాన్ని నేటి చిన్నారులకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వెల్లడించారు. సమ్మర్ క్యాంప్‌లో డ్రాయింగ్, ఎస్సె రైటింగ్, స్టోరి రీడింగ్, ఇండోర్ గేమ్స్, స్పోకెన్ ఇంగ్లీషు, పేపర్ క్రాఫ్ట్ ఎస్సే రైటింగ్, వివిధ రకాల కాంపిటీషన్లు ఉంటాయని చెప్పారు. విద్యార్థులు శ్రద్ధతో వీటన్నింటినీ నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి బి.మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలిరూరల్: మండలంలోని సంగంజాగర్లమూడిలో గల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులుసోమవారం ప్రారంభమయ్యాయి. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు డి. విశ్వనాథ్ తరగతులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతులను వినియోగించుకొని మంచి విజ్ఞానాన్ని పొందాలని బాలలకు సూచించారు. జూన్ 6వ తేదీ వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని గ్రంథాలయాధికారి జె. వెంకటేశ్వరరావు తెలిపారు. తరగతులకు వచ్చిన బాలలతో నీతి కథలు చదివించి చెప్పించారు.



వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న పంచాయితీ కార్యదర్శి హేమకుమారి



శిక్షణ తరగతుల్ని ప్రారంభిస్తున్న విశ్వనాథ్

నిందితులకు జరిమానా

తెనాలిరూరల్: గంజాయి కేసులో నిందితులకు జరిమాని విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. తెనాలి రూరల్ సీఐ ఎ.అశోక్‌కుమార్, ఎస్ఐ ఎం.మురళి 2020లో పట్టణానికి చెందిన షేక్ నాగూరా, బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం పల్లపట్ల గ్రామానికి చెందిన గంగుల దుర్గాప్రసాద్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. కేసు సోమవారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించి రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ పి. రాజశేఖర్ నిందితులిద్దరికీ ఐదు వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్ వాదించారు.

ప్రయాణికుడిపై దాడి, దోపిడీ

తెనాలిరూరల్: ప్రయాణికుడిని నమ్మించి అతనిపై దాడి చేసి సెల్‌ఫోన్, నగదు అపహరించి దుండగులు ఉడాయించారు. సేకరించిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా కొల్లూరుకు చెందిన పి. శివప్రసాద్ ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి తెనాలి వచ్చాడు. కొల్లూరు వెళ్లేందుకు బస్టాండ్ వద్ద వేచి ఉండగా ఇరువురు వ్యక్తులు బైక్‌పై వచ్చి తాము కూడా కొల్లూరు వెళ్తున్నట్లు నమ్మించారు. వారి మాటలు నమ్మి శివప్రసాద్ వారి ద్విచక్ర వాహనంపై ఎక్కాడు. కూచిపూడి లాకుల వరకు వెళ్లిన తర్వాత ఇరువురు దుండగులు శివప్రసాద్‌పై దాడి చేసి, అతని వద్ద నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నారు. ప్రతిఘటించే ప్రయత్నం చేసిన శివప్రసాద్‌ని పక్కనే ఉన్న కాలువలోకి నెట్టి పరారయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విచారణ చేపట్టారు.

విలువైన పశుదాణా వితరణ

తెనాలి: ఆపదలో వున్న వారికి, అవసరమైన ప్రజలకు తమ సేవలను అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ మానవత, తెనాలి శాఖ పశువులకూ తోడ్పాటును అందించాలని నిర్ణయించింది. పట్టణ బుర్రిపాలెంరోడ్డులోని గోశాలలోని ఆవులకు ఒక్కొక్కటి రూ.550 చొప్పున రూ.55 వేల విలువైన వంద బ్యాగుల పశువుల దాణాను సోమవారం సాయంత్రం అందజేశారు. నెలరోజులపాటు ఆవులకు దాణా ఉపకరిస్తుందని చెప్పారు. సంస్థ రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం సూచనకు అనుగుణంగా తక్షణం స్పందించిన సభ్యుల సహకారంతో ఈ గోసేవను చేయగలిగినట్టు మానవత, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ చెప్పారు. గోశాలలోని ఆవుల సంరక్షణ బాధ్యతలను నిర్వర్తిస్తున్న ప్రకాష్ జైన్, గోసంరక్షణ సంఘం సభ్యులు, వారికి సహకరిస్తున్న కుటుంబ సభ్యులను అభినందించారు. మానవత, తెనాలి ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్ మాట్లాడుతూ మానవత సంస్థ అవసరమైన సేవాకార్యక్రమాలు చేపట్టడంలో ముందంజలో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు పి.వాసు, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్య శాస్త్రి, ఎస్వీ శర్మ, జొన్నాదల నరసింహారావు, జీఎస్‌బీ ప్రభాకర్, సీహెచ్ సాంబశివరావు, మల్లాది అర్జున్, రోహిణి, కె.మదన్‌మోహన్, పి.మల్లికార్జున, భుజంగరావు, యు. సూర్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



గోవులకు దాణ సమర్పించిన మానవత బాధ్యులు

షార్ట్ ఫిల్మ్‌కు బహుమతి ప్రదానం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ ఉండవల్లికి చెందిన దర్శకుడు రూపొందించిన 'మా నాన్న పసివాడే' షార్ట్ ఫిల్మ్‌కు సోమవారం బహుమతి దక్కింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. డాక్టర్ కె.కె. ఆర్ వ్యాలీ వారు నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్ 2025లో ఉండవల్లికి చెందిన గాదె నాగభూషణానికి గౌరవం దక్కిందన్నారు. తన రచన, దర్శకత్వంలో త్రినేత్ర ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో వృద్ధులను కుటుంబ సభ్యులు ప్రేమతో ఆదరించాలని.. ఎదిగిన పసివాళ్లుగా ఇంట్లో వృద్ధులను చూడాలనే సందేశంతో రూపొందించిన 'మా నాన్న పసివాడే' షార్ట్ ఫిల్మ్ జ్యూరీ బహుమతిని గెలుచుకుందని తెలిపారు. షార్ట్ ఫిల్మ్ పోటీల నిర్వాహకులు కొసరాజు కోటేశ్వరరావు చేతులు మీదుగా షీల్డ్, సర్టిఫికెట్లు, రరూ7 వేలు నగదు బహుమతిని తన టీమ్‌తో కలసి నాగభూషణం అందుకోవడం సంతోషకరమన్నారు. ఈశ్వరయ్య పాత్రలో జొన్న రామలింగేశ్వరరావు జీవించారని అన్నారు. ఈ సందర్భంగా ఉండవల్లి ప్రజలు నాగభూషణంను అభినందించారు.



కొసరాజు కోటేశ్వరరావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గాదె నాగభూషణం

మణిపాల్‌లో ఎక్మో సేవలు

తాడేపల్లి రూరల్: పట్టణ పరిధిలోని మహానాడు మణిపాల్ హాస్పటల్ నందు ఎక్మో సేవలు అందుబాటులోకి వచ్చాయని మణిపాల్ వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎక్స్‌ట్రాకార్పొరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్ (ఎక్మో) ఒక కృత్రిమ గుండె–ఊపిరి తిత్తుల మెషిన్ అని.. ఇది రోగి అవయవాల పనిని తాత్కాలికంగా నిర్వహిస్తుందని అన్నారు. తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్య లేదా హార్ట్ ఫెయిల్యూర్ రోగుల్లో వెంటిలేటర్లు లేదా ఔషధాలు పనిచేయని స్థితిలో ఇది ఒక ఆధునిక ప్రాణ రక్షణగా నిలుస్తుందని తెలిపారు. యాక్యూట రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్ (ఎఆర్‌డిఎస్), తీవ్రమైన న్యూమోనియా, పల్మనరీ ఎంబోలిజం, కార్డియాక్ సర్జరీకి సంబంధించి తీవ్రమైన రోగుల్లో ఎక్మో ఒక ప్రాణరక్షణగా నిలుస్తుందని వివరించారు. క్రిటికల్ కేర్ కన్సల్టెంట్ డాక్టర్ వి.దినేష్ కుమార్ మాట్లాడుతూ ఆక్సిజనరేటర్ ఊపిరితిత్తుల్లో రక్తాన్ని శుద్ధి చేసే ప్రక్రియ నిర్వహిస్తుందని పేర్కొన్నారు.

జిల్లా వైద్యశాలలో గుండెనొప్పికి ప్రథమ చికిత్స

డాక్టర్ రామకృష్ణన్, ఎయిమ్స్ కార్డియాలజిస్ట్

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో గుండెనొప్పికి సంబంధించిన ప్రథమ చికిత్సను అందిస్తున్నట్లు, అవసరమైన వారు ఈ సేవలను ఉపయోగించుకోవాలని ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యశాల కార్డియాలజిస్ట్ డాక్టర్ రామకృష్ణన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్ ప్రతినిధి (ఐసీఎంఆర్) డాక్టర్ మీనాక్షి శర్మలు పేర్కొన్నారు. తెనాలి జిల్లా వైద్యశాలకు సోమవారం సాయంత్రం వారు పరిశీలించారు. ఇప్పటి వరకు గుండె సంబంధిత వ్యాధిగ్రస్థులకు అందించిన సేవలపై ఆరా తీశారు. అలాగే రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ 2023 ఆగస్టులో గుండెనొప్పి భారీనా పడిన రోగులకు ప్రథమ చికిత్స అందించడం జరుగుతుందన్నారు. అనంతరం వారిని గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు పంపిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 60 మంది రోగులకు రూ.30వేలు విలువచేసే ఇంజక్షన్‌ను ఉచితంగా చేసినట్లు చెప్పారు. దీనివలన గుండె వాల్స్‌లో పేరుకుపోయిన క్లాట్‌లు కరిగే అవకాశం ఉందన్నారు. కారయక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న డాక్టర్ రామకృష్ణన్

వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు భవనం వెంకటరెడ్డి మృతి

నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



భవనం వెంకటరెడ్డి (ఫైల్)

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టరు, వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు భవనం వెంకటరెడ్డి (57) సోమవారం ఉదయం మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న వెంకటరెడ్డి హైదరాబాద్‌లోని కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి క్రియాశీల పదవి తీసుకోకున్నా, తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు అత్యంత సన్నిహితుడిగా చేదోడువాదోడుగా ఉండేవారు. సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో వెంకటరెడ్డి భౌతిక కాయాన్ని తెనాలి గంగానమ్మపేటలోని నివాసానికి చేర్చారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హుటాహుటిన వెళ్లి, వెంకటరెడ్డి భౌతికకాయంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తనకు అత్యంత సన్నిహితంగా ఉంటూ వచ్చిన వెంకటరెడ్డి లేని లోటు తీరనిదని విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు. నివాళిఅర్పించినవారిలో వైఎస్సార్ సీపీ నాయకులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పార్టీ పట్టణ–2 అధ్యక్షుడు షేక్ దుబాయ్ బాబు, కౌన్సిలర్ యాతాటి అనిల్, కఠారి హరీష్, సిరికృష్ణ, మేకల రవికుమార్, మునిపల్లి వంశీ, గోపాలం శరత్‌బాబు తదితరులు ఉన్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు గంగానమ్మపేటలోని నివాసం నుంచి వెంకటరెడ్డి అంతిమయాత్ర ప్రారంభమవుతుందని కుటుంబసభ్యులు తెలిపారు.



పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

సాంకేతిక పరిజ్ఞానంతో ఉపాధి అవకాశాలు

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష విద్యార్థులకు అవగాహన సదస్సులో ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి

తెనాలి: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవటం ద్వారా ఉపాధి అవకాశాలను పొందవచ్చని దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అన్నారు. పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష ఈనెల 30వ తేదీన జరగనున్న సందర్భంగా స్థానిక ప్రకాశం రోడ్డులోని జేవీఎస్ క్రాంతి కోచింగ్ సెంటరు ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు మాక్ పరీక్ష నిర్వహించిన, అవగాహన సదస్సును ఏర్పాటుచేశారు. 215 మంది విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. మాక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదును బహూకరించారు. సదస్సులో ముఖ్యఅతిథి ఆచార్య కృపాచారి మాట్లాడుతూ ప్రవేశపరీక్షల్లో గట్టెక్కేందుకు విద్యార్థులు తీసుకోవాలన్సిన జాగ్రత్తలను సూచించారు. కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జెట్టి విజయశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టమైనప్పటికీ ఇష్టంతో పోటీపరీక్షలకు తయారైనప్పుడే విజయం సాధించగలరని చెప్పారు. రమేష్‌రెడ్డి, రవి, రాంబాబు, ధర్మారావు, సూర్య, గణేష్, పద్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి

కేంద్రం రాజధానికి నిధులు ఇస్తుందా!

తాడేపల్లి రూరల్: మే 2వ తేదీన విభజన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి పనుల పునఃప్రారంభానికి వస్తున్న ప్రధాని మోడీ ఈసారైనా నిధులు ఇస్తారా.. అని సీపీఎం నాయకులు ప్రశ్నించారు. సోమవారం తాడేపల్లి పట్టణపరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ ప్రతిపాదించిన లేఖను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమరావతి రాజధానిలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 42 కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు కేటాయించినా నేటికీ ఎందుకు నిర్మాణాలు చేపట్టలేదని ప్రశ్నించారు. అప్పులతో రాష్ట్రం అభివృద్ధి కాదని.. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులు గ్రాంట్‌గా ఇవ్వాలని కోరుతున్నామన్నారు. గతంలో రాజధాని శంకుస్థాపనకు వచ్చిన ప్రధాని గుప్పెడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు, నాయకులు జొన్న శివశంకరరావు, వేముల దుర్గారావు, డొంతిరెడ్డి వెంకట రెడ్డి, విజయ భాస్కరరెడ్డి, దర్శనపు విజయ్ బాబు, రామారావు, దశరథ రామిరెడ్డి, గంజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



లేఖలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

సాంస్కృతిక పునరుజ్జీవ ప్రయత్నం అభినందనీయం

నాసా–ఇస్రో మాజీ శాస్త్రవేత్త డాక్టర్ చందు సాంబశివరావు

తెనాలి: మారుతున్న విద్యారంగంలో ఎడారిలో ఒయాసిస్సులా శ్రీసరస్వతీ విద్యాపీఠం విద్యాసంస్థలు భాష, సంస్కృతులు, విలువలతో కూడిన విద్యను అందించటం శుభపరిణామమని నాసా, ఇస్రో మాజీ శాస్త్రవేత్త డాక్టర్ చందు సాంబశివరావు అన్నారు. స్థానిక సుల్తానాబాద్‌లోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాల గ్రాడ్యుయేషన్ డేను సోమవారం సాయంత్రం కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల సంచాలిత సమితి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ చందు సాంబశివరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, దేశవ్యాప్తంగా 26 వేల పాఠశాలలు, 1.50 లక్షల ఆచార్యులతో 36 లక్షల మంది విద్యార్థులకు జాతీయ విద్యను అందిస్తున్న 'విద్యాభారతి'కి అనుబంధంగా శ్రీసరస్వతీ శిశుమందిర్ సాంస్కృతిక పునరుజ్జీవం కోసం ప్రయత్నించటం అభినందనీయమన్నారు. ఈ విద్యా యజ్ఞంలో పాల్గొంటున్న మాతాశ్రీలు, ఆచార్యులు, సహకరిస్తున్న వలంటీర్లకు సమాజం ఎల్లవేళలా రుణపడి ఉంటుందన్నారు. పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం తన ప్రసంగంలో పిల్లలకు చదువుతో పాటు సంస్కారం నేర్పించాలని సూచించారు. తల్లిదండ్రులు క్రమశిక్షణతో పెంచిననాడు పిల్లలు తప్పనిసరిగా సక్సెస్‌ను సాధిస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇక్కడ చదివి ఉన్నతస్థాయికి ఎదగిన వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వివిధ తరగతుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. సంచాలిత సమితి కార్యదర్శి కోడూరు రమాదేవి స్వాగతం పలికిన సభలో సరస్వతీ విద్యాపీఠం, విజయవాడ సమితి సభ్యుడు సన్నిధి వెంకటసుబ్బారావు, పాఠశాల విద్యాకమిటీ కోశాధికారి డాక్టర్ అవ్వారు లత మాట్లాడారు. విద్యాకమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి హనుమంతరావు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత విద్యార్థుల సాంస్కృతిక అంశాలను ప్రదర్శించారు.



మాట్లాడుతున్న డాక్టర్ చందు సాంబశివరావు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మే డే కరపత్రాల ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్: మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ ఆధ్వర్యంలో తాడేపల్లి నులకపేట ఆటో యూనియన్ కార్యాలయంలో మే డే కరపత్రాన్ని సంఘం నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు యస్.కె శ్రీను మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారతదేశ కార్మిక వర్గాన్ని కక్షగట్టి మే డే అమరవీరుల స్ఫూర్తితో సాధించుకున్న కార్మికుల హక్కులను రద్దు చేస్తున్నారని విమర్శించారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులను పెట్టుబడి దారులకు బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని.. మోటర్ రంగం యజమానుల మీద, కార్మికులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు. 139వ మే డే కార్యక్రమాలను చికాగో అమరవీరుల సాక్షిగా వాడవాడలా నిర్వహించనున్న జెండా ఆవిష్కరణలు, ర్యాలీలు, సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ కార్యదర్శి షేక్ సైదా, ఉపాధ్యక్షులు జాన్ సైదా, కోశాధికారి శ్రీను, గౌరవ అధ్యక్షులు కొండారెడ్డి వినయ్, రామారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.